## 193. చావు భయం

తీర్థ యాత్రలకి వెళ్ళే పద్మావతి నర్మదా నదీ తీరానికి వచ్చింది. రేవు దాటే పడవ సిద్ధంగా ఉండటం చూసి అందులోకి ఎక్కింది. అప్పటికే దట్టమైన నల్లటి మేఘాలతో అలుముకుని ఉన్న ఆకాశంలో అకస్మాత్తుగా తీవ్రమైన వేగంతో గాలులు చెలరేగి పడవ ప్రమాదంలో పడింది. దాన్ని కంట్రోల్ చేయడానికి పడవ వాడు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. అంతా భయపడ్డారు.

అదే పడవలో ప్రయాణించే ఓ సన్న్యాసి మాత్రం నిశ్చలంగా కూర్చున్నాడు. పడవ క్షేమంగా ఆవలి తీరం చేరాక అడిగిందామె అతన్ని.

"మేమంతా అంత భయపడితే మీరు అలా ఎలా నిర్భయంగా కూర్చోగలిగారు?"

"నేనిప్పటికిప్పుడు నిన్ను గొంతు పిసికి చంపేస్తానంటే నువ్వు భయపడతావా?" ప్రశ్నించాడు సన్న్యాసి.

"ఊహు. మీకు నా మీద ద్వేషం ఉంటే భయపడతాను తప్ప లేకపోతే నాకెందుకు భయం?"

"అలాగే భగవంతుడికి నా మీద ద్వేషం లేదు. పైగా నన్ను ప్రేమించే ఆయన నా ప్రాణాలు తీస్తాడని నేనెందుకు భయపడాలి? ఆయన సృష్టించిన తుఫాను ఉత్తి బెదిరింపు మాత్రమే. కాలం తీరాక ఎవరైనా చావాల్సిందే. కాబట్టి అంతదాకా చావు భయం అనవసరం." బోధించాడు ఆ సన్న్యాసి.

## 194. శ్రమ - ప్రేమ

ఢిల్లీనించి బయలుదేరిన ఓ రైల్లో ఓ సన్న్యాసి టాయ్‌లెట్ పక్కన పేపర్ పరుచుకుని పడుక్కుని ప్రయాణం చేయడం తన కుటుంబ సభ్యులతో అత్తవారింటికి వెళ్తున్న ఓ గృహస్థు గమనించాడు.

"ఎక్కడికి?" అడిగాడు.